KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

## నేటి మాట

ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే... ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్నే నాశనం చేస్తుంది



-స్వామి వివేకానంద

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 107 | శనివారం 04 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## బాలిక గర్భవతిగా వస్తే పోలీసులకు చెప్పాల్సిందే

### కర్ణాటక ప్రభుత్వ ఆదేశాలు

ప్రైవేట్ ఆస్పత్రులకు మార్గదర్శకాలు

కఠిన చర్యల హెచ్చరిక

పోక్సో చట్టం ప్రాముఖ్యత

సెక్షన్ 19(1) నిబంధనలు

బాధితురాలి గోప్యత

సిబ్బందికి అవగాహన



2 లో

## దక్షిణాసియా వస్త్ర రాజధానిగా తెలంగాణ

### ATEXCON సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

న్యూస్ డెస్క్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ రాష్ట్రం కేవలం ఐటీ, ఫార్మా రంగాల్లోనే కాకుండా, ప్రపంచ వస్త్ర రంగంలోనూ అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇవాళ హైటెక్స్‌లో జరిగిన 13వ ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ (ATEXCON) 2026 ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

టెక్స్‌టైల్ మన డి ఎన్ఏ లోనే ఉంది

తెలంగాణకు వస్త్ర రంగంతో విడదీయలేని అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. 'టెక్స్‌టైల్ అనేది మనకు కేవలం ఒక పరిశ్రమ కాదు, అది మన జీవనాధారం. నిజాం కాలం నుండి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు వస్త్రాలు, ముత్యాల కోసం హైదరాబాద్‌కు వచ్చేవారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వంటివి మన సంస్కృతిలో భాగం. టెక్స్‌టైల్ మన డి ఎన్ఏ లోనే ఉంది' అని ఆయన వ్యాఖ్యానించారు.

త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం..

రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను సీఎం ఈ సందర్భంగా ఆవిష్కరించారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతూ.. తెలంగాణను దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడం మా ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉందని, ఇందులో అనేక అపారెల్ పార్కులు ఉన్నాయని సీఎం తెలిపారు.



2 లో

## గ్రూప్-1 పై సుప్రీంకోర్టు తీర్పు

### సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




2 లో

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల మా ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపు గా భావిస్తున్నానన్నారు.ాష్ట్రంలో గ్రూప్-1 నియామకాలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పును సమర్ధించింది.

## భోజన ప్రియులకు బంపరాఫర్..

### నెలంతా ఫ్రీ ఫుడ్ అంట!

ఎల్‌పీజీ కొరత ప్రభావం

హోటళ్లపై తీవ్ర ప్రభావం

గ్యాస్ కోసం కొత్త ఐడియా

వైరల్‌గా మారిన ఫ్లెక్సీ

నెటిజెన్ల ఆసక్తికర కామెంట్స్




2 లో

## మళ్లీ భగ్గుమన్న ఇంధన ధరలు

### లీటర్ పెట్రోల్ రూ.458



2 లో

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పాకిస్తాన్ వాహనదారులకు బిగ్ షాక్ తగిలింది. పాకిస్తాన్ దేశంలో మరోసారి చమురు ధరలు పెరిగిపోయాయి. నెల రోజుల వ్యవధిలోనే రెండోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ పాకిస్తాన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. 42.7% పెరుగుదలతో లీడర్ పెట్రోల్ ధర 458 పాకిస్తానీ రూపాయలకు చేరుకుంది. అదే సమయంలో డీజిల్ రేటు 55% పెరిగింది.ఈ లెక్క ప్రకారం లీటర్ డీజిల్ ధర 520 కు చేరుకుంది. తాజాగా పెరిగిన కిందన ధరలు ఇవాళ్టి నుంచి అమలులోకి వస్తాయి.

## అమరావతి అన్‌స్టాపబుల్

### ఆత్మగౌరవ ప్రస్థానం నుంచి అఖండ విజయం వరకూ


న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): అమరావతి.. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అవ్వడం అనేది నిన్న ఒక కలగా ఉంటే.. నేడొక నిశ్చయంగా మారింది. రేపు ఒక అద్భుతంగా మారనుంది. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆశల సౌధం, 34 వేల మంది రైతుల త్యాగ ఫలం మన అమరావతి. కాలం ఎన్ని పరీక్షలు పెట్టినా, అడుగులు తడబడినా.. లక్ష్యం మాత్రం చెదరలేదు. పార్లమెంట్ సాక్షిగా అమరావతికి చట్టబద్ధత లభించడంతో.. అది అన్ స్టాపబుల్ గా మారింది.

త్యాగమే పునాదిగా..

ఏ రాష్ట్రంలో రాజధానికైనా ఇటుకలు పునాదులైతే.. అమరావతి నిర్మాణానికి మాత్రం రైతుల త్యాగం, నమ్మకమే పునాదులయ్యాయి. కడుపుకోతను భరించి, పచ్చని పొలాలను రాజధాని కోసం ధారపోసిన 34 వేల మంది రైతుల త్యాగం సామాన్యమైనది కాదు. ఆ త్యాగమే నేడు అమరావతి కేవలం ఒక నగరంలా కాకుండా.. అందరి భావోద్వేగంగా మారింది. మధ్యలో ఎన్నో సందిగ్ధతలు, మరెన్నో అడ్డంకులొచ్చినా, ఆటుపోట్లు ఎదురైనా భూములిచ్చిన రైతుల పోరాట పటిమ అమరావతి జ్యోతిని ఆరిపోకుండా కాపాడింది.

దేశం గొంతుకై.. ఆంధ్రుల ఆత్మాభిమానానికి దక్కిన గౌరవం

విభజన తర్వాత సొంత రాజధాని లేకుండా పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిపై ఆధారపడిన ఆంధ్రప్రదేశ్ కు.. అమరావతి ఒక భవిష్యత్తుగా మారింది.




2 లో

## రైతన్నలకు గుడ్ న్యూస్

### రెండో విడత రైతు భరోసాకు ముహూర్తం ఖరారు!

రూ.2,650 కోట్ల నిధుల సమీకరణ

అధికారులకు సీఎం ఆదేశాలు

మూడు దఫాల్లో నిధుల పంపిణీ

మొదటి విడత ఇప్పటికే జమ

రెండో విడతకు ముహూర్తం

ఎకరం పైగా ఉన్న రైతులకు లాభం




2 లో

## రానున్న రెండు రోజులు జాగ్రత్త

42-43 డిగ్రీల ఉష్ణోగ్రతలు


వడగాలుల హెచ్చరికలు

మండలాల వారీగా అలర్ట్

విజయనగరంలో రికార్డ్ టెంపరేచర్

ప్రజలకు జాగ్రత్త సూచనలు

వృద్ధులు, గర్భిణులకు ప్రత్యేక హెచ్చరిక




2 లో

## రూ.7 వేల కోట్లతో మూసీ పునరుజ్జీవనం

### పీపీపీ మోడ్‌లో గాంధీ నాలెడ్జ్ హబ్

- తొలి దశలో 21 కి.మీ అభివృద్ధి
- గాంధీ సరోవర్‌కు ప్రత్యేక ప్రాధాన్యం
- పీపీపీ మోడ్‌లో వరల్డ్ క్లాస్ ప్రాజెక్టు
- 123 అడుగుల గాంధీ విగ్రహం
- జాతీయ మ్యూజియం ఏర్పాటు
- గాంధీ నాలెడ్జ్ హబ్ నిర్మాణం
- చేనేత ప్రోత్సాహక కేంద్రం
- నదీతీరంలో ధ్యాన గ్రామం



న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుపై ఫోకస్ పెట్టింది. ప్రాజెక్టును ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టడమే ప్రభుత్వం లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఎన్జీటీ కేసు డిస్పోజ్‌తో కాస్త ఊరట లభించింది. అయితే మొదటి దశ 21 కిలోమీటర్ల ప్రాజెక్టులో భాగంగా 200 ఎకరాల్లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టును పబ్లిక్, ప్రయివేటు పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానంలో ప్రపంచ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

రూ.7 వేల కోట్లతో..

'మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో మొదటి దశలో చేపట్టనున్న 21 కిలోమీటర్ల ప్రాజెక్టుకు భూసేకరణ ఖర్చు కాకుండానే రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కి.మీ మార్గాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి భూసేకరణ, హిమాయత్ సాగర్ బండ్ బలోపేతం, ఎకో ప్రాజెక్టు పనులను చేపట్టనున్నారు. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు విస్తరణ, రక్షణశాఖకు సంబంధించిన భూములను సేకరించే కార్యక్రమాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టాలని నిర్ణయించింది.

మిగతాది 2 లో

## పోలీసు అధికారులకు బెదిరింపులు

### మాజీ మంత్రిపై పేర్ని నానిపై కేసు




2 లో

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని చిక్కుల్లో పడ్డారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు వారిని తీవ్రస్థాయిలో హెచ్చరించినందుకు గాను కృష్ణా జిల్లా చిలకలపూడి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. మచిలీపట్నం లోని కొబ్బరితోట ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఒక ఇంటిని అధికారులు కూల్చివేశారు.

## రూ.7.5 కోట్ల కుంభకోణం కేసు..

### ఐఏఎస్ రోహిణి సింధూరికి బిగుస్తున్న ఉచ్చు



2 లో

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కర్ణాటకకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి కి కర్ణాటక హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

# రానున్న రెండు రోజులు జాగ్రత్త

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు బిగ్ అలర్ట్. ఏపీలో ఎండలు దంచి కొడుతున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. 42 నుంచి 43 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇక ఇవాళ మొత్తం 54 మండలాలలో తీవ్ర వడగాలులు, 16 మండలాలలో వడగాలులు వీచే ప్రమాదం పొంచి ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇక రేపు 41 మండలాలలో తీవ్ర వడగాలులు, 21 మండలాలలో వడగాలులు వీచే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ.

విజయనగరంలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు

గురువారం రోజున విజయనగరం జిల్లా రాజాంలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. 40.6 డిగ్రీలు నమోదు అయింది. మన్యంలోని మక్కువ, చిత్తూరులోని నింద్ర ప్రాంతంలో 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు చేసింది. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖార్ జైన్ కీలక సూచనలు చేశారు.

# రూ.7 వేల కోట్లతో మూసీ పునరుజ్జీవనం పీపీపీ మోడ్‌లో గాంధీ నాలెడ్జ్ హబ్

మొదటి పేజీ తరువాయి

పీపీపీ మోడ్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు: మూసీ, ఈసీ నదుల సంగమంగా ఉన్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఈ కేంద్రాన్ని పీపీపీ మోడ్‌లో ప్రపంచ స్థాయి ఫెసిలిటీ సెంటర్‌గా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ ప్రాజెక్టులో గాంధీ విగ్రహం ఉండే భవనం 100 మీటర్ల వరకు ఉంటుంది. దీనిపై గాంధీ విగ్రహం 123 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. దీంతోపాటు గాంధీ సరోవర్‌లో శాంతి విగ్రహంతోపాటు స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ చేసిన పోరాటాలు, ఆయన ఫిలాసఫీకి సంబంధించిన జాతీయ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గాంధీ సాహిత్యం, పరిశోధనలు, పుస్తకాలతో కూడిన నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. గాంధీ చరఖాను స్వదేశీ ఉద్యమంలో భాగంగా స్వయం సమృద్ధికి, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకతకు చిహ్నంగా మార్చారు. 1918లో మగన్‌లాల్ గాంధీ రూపొందించి సవరించిన చరఖానే 'గాంధీ చరఖా'గా ప్రసిద్ధి చెందింది. ఇది ఖాదీ ఉత్పత్తికి, గ్రామ పరిశ్రమల ప్రోత్సాహానికి, ఆర్థిక స్వేచ్ఛకు ప్రధాన సాధనంగా నిలిచింది. దీని ఆధారంగా చేనేత ప్రోత్సాహక కేంద్రాన్ని సైతం అభివృద్ధి చేయనున్నారు. దీంతోపాటు పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో నదీ తీరంలో సేదతీరడానికి ధ్యాన గ్రామాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదీ తీర ఘాట్‌లతో కూడిన ప్రజా వినోద కేంద్రాలకు పెద్దపీట వేయనున్నారు.

# అమెరికా సర్కారులో కీలక పరిణామం అటార్నీ జనరల్ పదవికి పామ్ బాండీ రాజీనామా

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లుగా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా సమాచారాన్ని తెలియజేశారు. పామ్ బాండీ స్థానంలో ప్రస్తుత డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచె తాత్కాలిక అటార్నీ జనరల్‌గా బాధ్యతలు చేపడతారని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పామ్ బాండీ సేవలను కొనియాడుతూ.. ఆమె గొప్ప దేశభక్తురాలు, నమ్మకమైన స్నేహితురాలు అంటూ కితాబిచ్చారు. గత ఏడాది కాలంగా అటార్నీ జనరల్‌గా ఆమె ఎంతో నిబద్ధతతో పనిచేశారని తెలిపారు.. త్వరలోనే ఆమె ప్రైవేట్ రంగంలో ఓ కీలక బాధ్యతను చేపట్టబోతున్నారని ట్రంప్ పేర్కొన్నారు.

అయితే, బాండీని ట్రంప్ పదవి నుంచి తొలగించారంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడిన కొద్దిసేపటికే ఈ ప్రకటన రావడం గమనార్హం. గతంలో ట్రంప్ వ్యక్తిగత న్యాయవాదిగా పనిచేసిన టాడ్ బ్లాంచె ఇప్పుడు న్యాయశాఖ తాత్కాలిక బాధ్యతలు స్వీకరించనుండటంతో పొలిటికల్‌గా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# వారసుడి కోసం.. భార్య, కూతుర్లు దారుణ హత్య



న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కనడానికి అమ్మ, పెళ్లికి భార్య కావాలి. కానీ.. తాను పిల్లల్ని కనే విషయంలో మాత్రం కొందరు పురుషులు ఇప్పటికీ తమ ఆలోచనా ధోరణిని మార్చుకోవడం లేదు. సృష్టికి మూలం ఆడది అంటారు.. ఆ ఆడపిల్లల్ని కనేందుకు మాత్రం అస్సలు ఒప్పుకోరు కొందరు. ఇద్దరూ ఆడపిల్లలే పుడితే మూడో కాన్పు లేకుండా ఆపరేషన్ చేయించుకోవాల్సింది పోయి.. వారసుడి కోసం తపించాడు. తీరా చూస్తే.. మళ్లీ ఆడపిల్ల పుడుతుందేమోనన్న భయంతో అబార్షన్ చేయించుకోవాలని భార్యపై ఒత్తిడి చేశాడు. ఒప్పుకోకపోవడంతో ఆమెతో పాటు ఇద్దరు కూతుళ్లను నీటిలో తోసేసి చంపేశాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అజారుద్దీన్, ఫర్హాత్ (26) దంపతులకు పెళ్లై ఇద్దరు కూతుర్లు ఉమేరా (8), ఆయేషా (6) ఉన్నారు. అజారుద్దీన్ ఊరి శివారులో వరంగల్ – ఖమ్మం నేషనల్ హైవే పక్కన ఒక స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత మరో రెండుసార్లు భార్య ప్రెగ్నెంట్ అవ్వగా మళ్లీ ఆడపిల్లలే పుడతారన్న భయంతో అబార్షన్లు చేయించాడు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఫర్హాత్ ప్రెగ్నెంట్ అవ్వగా.. అజారుద్దీన్ ను అదే భయం వెంటాడింది. మళ్లీ అబార్షన్ చేయించుకోవాలని భార్యపై ఒత్తిడి చేయగా ఆమె ఒప్పుకోలేదు. పలుమార్లు గొడవలూ అయ్యాయి.

ఎలాగైనా ఆమెను చంపాలని భావించిన అజారుద్దీన్ బుధవారం రాత్రి ఫర్హాన్, ఇద్దరు కూతుర్లను స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లి నీటిలో ముంచి హతమార్చాడు. మర్నాడు ముగ్గురూ ప్రమాదవశాత్తు మరణించారని కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ ఆమె తండ్రి అలీకి భర్తపై అనుమానం కలిగింది. పోలీసులకు కంప్లైంట్ చేయగా.. విచారణలో నేరాన్ని అంగీకరించాడు. భార్యలేకుండా పిల్లల్ని పెంచడం కష్టమని భావించి, వారిద్దరిని కూడా చంపేసినట్లు చెప్పాడు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అజారుద్దీన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# డ్రగ్స్ పార్టీలో ఐఏఎస్ కుమారుడు.. టెస్టుల్లో పాజిటివ్!

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): గ్రేటర్ హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. కొండాపూర్‌లోని క్వాక్ ఎరీనా పబ్‌లో పోలీసులు జరిపిన మెరుపు దాడులు సంచలనానికి దారితీశాయి. ముఖ్యంగా, సమాజంలో బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న ఒక మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు ఈ డ్రగ్స్ పార్టీలో దొరికిపోవడం చర్చనీయాంశంగా మారింది. పబ్‌లో జరిగిన సోదాల సమయంలో పోలీసులు ఎవరినీ వదలకుండా అనుమానితులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించారు. మొత్తం 64 మందికి పరీక్షలు చేయగా, అందులో మహిళా ఐఏఎస్ కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్ అని తేలింది. డ్రగ్స్ వినియోగించినట్లు శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో పోలీసులు అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

పాజిటివ్ వచ్చిన ఐఏఎస్ కుమారుడితో పాటు మరో ఏడుగురిని పోలీసులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఉన్నత స్థాయి కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ కేసు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనలు అతిక్రమించి డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్న పబ్ యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# దక్షిణాసియా వస్త్ర రాజధానిగా తెలంగాణ ATEXCON సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

నాణ్యమైన పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ఇక్కడి పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి పేరుందని పేర్కొన్నారు. లండన్, పారిస్, దుబాయ్ వంటి ఫ్యాషన్ నగరాల్లో తెలంగాణలో తయారైన దుస్తులు మెరవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

సినిమా, ఫ్యాషన్, గ్రీన్ టెక్నాలజీ

హైదరాబాద్ ఇప్పుడు కేవలం టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాకుండా, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థల రాకతో హాలీవుడ్ స్థాయికి చేరుతోందని సీఎం అన్నారు. సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ అవసరాలను కూడా తెలంగాణ నుంచే తీర్చేలా ప్రోత్సహిస్తామన్నారు. అలాగే, పర్యావరణానికి ప్రాధాన్యతనిస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్'లను అభివృద్ధి చేస్తామని, మహిళలకు అధునాతన డిజైనింగ్, స్టిచింగ్‌లో శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. 'మీ దగ్గర విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. భూమి, విద్యుత్, నీరు మరియు వేగవంతమైన అనుమతులతో పాటు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రండి, కలిసి ఒక కొత్త భవిష్యత్తును నిర్మిద్దాం'అని పెట్టుబడిదారులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచానికి వ్యాక్సిన్లు, ఆపిల్ ఇయర్‌పాడ్స్ అందిస్తున్న తెలంగాణ.. ఇప్పుడు ప్రపంచం ధరించే దుస్తులను కూడా అందించే స్థాయికి చేరుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# అమరావతి అన్‌స్టాపబుల్ : ఆత్మగౌరవ ప్రస్థానం నుంచి అఖండ విజయం వరకూ

మొదటి పేజీ తరువాయి

కొన్నేళ్లుగా అమరావతి విషయంలో సాగిన అనిశ్చితికి కూటమి ప్రభుత్వం తెరదించుతూ.. రాష్ట్ర అసెంబ్లీలో అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపి.. దానిని పార్లమెంట్ కు పంపింది. పార్లమెంట్ ఈ బిల్లుకు చట్టబద్ధతనిస్తూ ఆమోదం తెలుపడం చారిత్రాత్మక మలుపనే చెప్పాలి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ యావత్ దేశం.. అమరావతి ఆంధ్రుల రాజధాని అని ముక్తకంఠంతో చాటిచెప్పింది. ఆ క్షణాలు ఆంధ్రులను భావోద్వేగానికి గురిచేశాయి. ఇది ఆంధ్రుల ఆత్మాభిమానానికి దక్కిన జాతీయ గౌరవమనడంలో అతిశయోక్తి లేదు.

ఆంధ్రుల సంకల్పం అమరావతి

బలమైన చట్టబద్ధత తోడవ్వడంతో.. ఇప్పుడు అమరావతి నిర్మాణం శరవేగంగా సాగనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఐటీ హబ్ లు, విద్యాసంస్థలు, పర్యాటక కేంద్రాలతో కూడిన ప్రపంచస్థాయి రాజధానిగా రూపుదిద్దుకోనుంది. అమరావతికి చట్టబద్ధత రావడంతో పెట్టుబడిదారులకు నమ్మకం పెరిగి, యువతకు ఉపాధి ఆశలు చిగురించాయి. అమరావతి అంటే కేవలం భవనాల సముదాయం కాదని, అది ఆంధ్రుల సంకల్పమని నిరూపితమైంది. నిన్నటి పోరాటం.. నేటి గౌరవంగా మారింది. ఎన్ని అడ్డంకులొచ్చినా, ఎంతమంది అడ్డు తగిలినా సరే.. ప్రజాబలం, చట్టబద్ధత తోడైన అమరావతి ప్రయాణం ఇక ఆపడం ఎవ్వరితరం కాదని తాజాగా జరిగిన రాజధాని సంబరాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి ఇక అన్ స్టాపబుల్ రాజధాని అని హర్షం వ్యక్తం చేశారు.

# బాలిక గర్భవతిగా వస్తే పోలీసులకు చెప్పాల్సిందే కర్ణాటక ప్రభుత్వ ఆదేశాలు

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): 18 సంవత్సరాల్లోపు బాలికలు గర్భంతో ఆస్పత్రులకు వస్తే కచ్చితంగా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందేనని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రైవేట్ ఆస్పత్రులకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఆదేశాలను పాటించని వైద్యులు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సమాచారం ఇవ్వడంలో విఫలమైన సంస్థ బాధ్యులకు ఏడాది వరకూ జైలుశిక్ష, జరిమానా కూడా విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

పోక్సో చట్టం 2012 ప్రకారం.. 18 ఏళ్ల లోపు బాలిక గర్భవతి అవ్వడం తీవ్రమైన నేరమని, దానిపై కచ్చితంగా సమాచారం ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. పోక్సో చట్టంలోని సెక్షన్ 19(1) ప్రకారం నేరం జరిగినట్లు తెలిసినా, జరగబోతోందని అనుమానం వచ్చినా ఆ సమాచారాన్ని స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ లేదా స్థానిక పోలీసులకు అందించాలన్నారు. బాధితురాలి డీటెయిల్స్ ను బయటకు చెప్పకుండా అధికారులకు సహకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బందికి కూడా పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని సూచించింది.


# భోజన ప్రియులకు బంపరాఫర్.. నెలంతా ఫ్రీ ఫుడ్ అంట!

న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌పీజీ సిలిండర్ల కొరత సామాన్యులనే కాదు, హోటల్ యజమానులను కూడా బెంబేలెత్తిస్తోంది. గ్యాస్ అందక వంట పొయ్యిలు వెలవెలబోతుండటంతో చాలా చోట్ల హోటళ్లు మూతపడుతున్నాయి. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని ఓ హోటల్ యజమాని పెట్టిన ఆసక్తికర ఫ్లెక్సీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వినూత్న ఆలోచన.. అదిరే ఆఫర్

వ్యాపారం సజావుగా సాగాలంటే తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్లు కావాల్సిన పరిస్థితి ఉంది. అయతే, మార్కెట్‌లో గ్యాస్ దొరకడం గగనమైపోవడంతో, సదరు హోటల్ యజమాని ఓ వినూత్న ఆలోచనకు తెరలేపాడు. 'మాకు ఒక గ్యాస్ సిలిండర్ తెచ్చి ఇవ్వండి.. మీకు నెల మొత్తం ఉచితంగా భోజనం, టిఫిన్ పెడతాం' అంటూ తన హోటల్ ముందే పెద్ద బ్యానర్ కట్టేశాడు. గ్యాస్ సంక్షోభం కారణంగా హోటల్‌ను మూసేయడం ఇష్టం లేక, ఎలాగైనా సిలిండర్లు సంపాదించాలనే ఉద్దేశంతో అలా ఓపెన్ ఆఫర్ పెట్టినట్లుగా హోటల్ నిర్వాహకుడు తెలిపారు. ఈ వింత ఆఫర్ ఉన్న ఫ్లెక్సీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'గ్యాస్ సిలిండర్ ఇప్పుడు బంగారం కంటే విలువైపోయింది'.. 'ఇది కదా అసలైన బిజినెస్ మైండ్ అంటే!' అని నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు.

# భలే ఐడియా ఈ స్మార్ట్ రీసైక్లింగ్.. ప్లాస్టిక్ ఇస్తే బ్యాగ్ ఫ్రీ



న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకు పర్యావరణానికి పెను సవాలుగా మారుతోంది. ఆధునిక జీవనశైలిలో మానవులకు ప్లాస్టిక్ ఇప్పుడు ఓ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. దీంతో అనేక పర్యాటక ప్రాంతాల్లో ప్లాసిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెడుతూ ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించేలా చెన్నైలోని ప్రముఖ మెరీనా బీచ్?లో వినూత్న ప్రయోగం అందరినీ ఆకట్టుకుంటోంది. ప్లాసిక్ బాటిల్ డిపాజిట్ చేస్తే ఉచితంగా ఎకో–ఫ్రెండ్లీ బ్యాగ్‌లు ఇచ్చేలా సరికొత్త మిషన్ ను బీచ్ లో ఏర్పాటు చేశారు.

దీంతో ఇప్పుడు బీచ్ కు వస్తున్న పర్యాటకులు తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్ అక్కడా ఇక్కడా పారేయకుండా ఈ మిషన్ వద్ద డిపాజిట్ చేసి ఉచితంగా పర్యావరణ సరిత బ్యాగులు తీసుకుంటున్నారు. ఇందుకు సంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా నెటిజన్లు స్పందిస్తూన్నారు. ఇలాంటి 'స్మార్ట్' రీసైక్లింగ్ పద్ధతులు దేశంలోని మిగతా అన్ని నగరాల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# గ్రూప్-1 పై సుప్రీంకోర్టు తీర్పు.. సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి..కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టం పై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ –1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అన్నారు.

దుష్ట శక్తుల కుట్రలను ఛేదించాం:

ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసిందన్నారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ –1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. ఉద్యోగాలను ఎంపికైన వారికి మరో సారి నా అభినందనలు అని తెలిపారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించామన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మళ్లీ భగ్గుమన్న ఇంధన ధరలు లీటర్ పెట్రోల్ రూ.458

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు పాకిస్తాన్ పెట్రోలియం మంత్రి అలీ మాలిక్ అధికారిక ప్రకటన చేశారు. ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు కొరత నెలకొంది.

యుద్ధం నేపథ్యంలో పెంచాల్సిందే.. పాక్ ప్రకటన

యుద్ధం నేపథ్యంలోనే ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని మంత్రి అలీ మాలిక్ వెల్లడించారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్ ధరలు అదుపు తప్పయని వెల్లడించారు. దీంతో ధరలు పెంచక తప్పదని ఆయన కుండ బద్దలు కొట్టి చెప్పారు. అయితే ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు కొంత ఊరట ఇచ్చేందుకు కొన్ని సబ్సిడీలను కూడా ప్రకటించింది పాకిస్తాన్ ప్రభుత్వం. చిన్న రైతులు, పబ్లిక్ ట్రాన్స్ పోర్టు వాహనాలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే మూడు నెలల పాటు ప్రతీ నెల 20 లీటర్ల వరకు కొంతమేర సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధమైంది సర్కార్.

# పోలీసు అధికారులకు బెదిరింపులు మాజీ మంత్రిపై పేర్ని నానిపై కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి

ఈ విషయం తెలుసుకున్న పేర్ని నాని తన అనుచరవర్గంతో కలిసి అక్కడికి చేరుకున్నారు. కూల్చివేతలను అడ్డుకోవడమే కాకుండా, అక్కడున్న ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్ర పదజాలంతో బెదిరింపులకు దిగారు.

పోలీసుల యాక్షన్..

బాధ్యత గల ప్రజాప్రతినిధిగా ఉండి అధికారులపై దురుసుగా ప్రవర్తించడంపై పోలీసు అధికారుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు వారు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన చిలకలపూడి పోలీసులు, పేర్ని నానిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రూ.7.5 కోట్ల కుంభకోణం కేసు.. ఐఏఎస్ రోహిణి సింధూరికి బిగుస్తున్న ఉచ్చు

మొదటి పేజీ తరువాయి

గతంలో మైసూర్ జిల్లాలో జరిగిన 'ఎకో ఫ్రెండ్లీ బ్యాగుల' కొనుగోలు కుంభకోణంలో ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు తక్షణమే అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

2021లో రోహిణి సింధూరి మైసూర్ జిల్లా కలెక్టర్‌గా, అలాగే కర్ణాటక చేనేత అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టు కోసం వివిధ స్థానిక సంస్థలకు పంపిణీ చేసేందుకు 'ఎకో ఫ్రెండ్లీ' బ్యాగులను కొనుగోలు చేశారు. అయితే, బయట మార్కెట్‌లో ఒక్కో బ్యాగు ధర కేవలం రూ.13 ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా కేఎచ్డీసీ నుంచి ఒక్కో బ్యాగును రూ.52 వెచ్చించి కొనుగోలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.7.5 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సామాజిక కార్యకర్త, న్యాయవాది రవిచంద్ర గౌడ కోర్టును ఆశ్రయించారు.

హైకోర్టు కీలక వ్యాఖ్యలు..


ఈ కేసులో విచారణకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్ కోరగా, గతంలో కర్ణాటక ప్రభుత్వం రెండుసార్లు నిరాకరించింది. అంతర్గత శాఖా పరమైన విచారణలో ఆమెకు క్లీన్ చిట్ వచ్చిందని ప్రభుత్వం వాదించింది. అయితే, దీనిపై తీవ్రంగా స్పందించిన జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిని ప్రాథమిక దశలోనే తొలగించలేమని.. లోతైన విచారణ ద్వారానే నిజానిజాలు బయటపడాలన్నారు. శాఖా పరమైన విచారణకు, క్రిమినల్ విచారణకు సంబంధం ఉండదు, ఒక దానిలో క్లీన్ చిట్ వచ్చినంత మాత్రాన రెండోది ఆగిపోదని అన్నారు. దీంతో అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ కింద ఆమెపై దర్యాప్తు జరిపేందుకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కోర్టు ఆదేశించింది. పదేపదే ఈ విషయాన్ని ప్రభుత్వం తిరస్కరించడం సరికాదని, న్యాయం జరగాలంటే విచారణ సాగాల్సిందేనని స్పష్టం చేసింది. కాగా, గతంలో ఐఏఎస్ అధికారిణి రూప మౌద్గిల్‌తో జరిగిన వివాదం తర్వాత వార్తల్లో నిలిచిన రోహిణి సింధూరి, రూ.7.5 కోట్ల కుంభకోణం కేసులో విచారణను ఎదుర్కొనబోతోంది.

# రైతన్నలకు గుడ్ న్యూస్: రెండో విడత రైతు భరోసాకు ముహూర్తం ఖరారు!




న్యూస్ డెస్క్ , 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): : రెండో విడత రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకోసం రూ.2,650 కోట్ల నిధులను సమీకరించాలని ఆర్థిక శాఖను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్టు సమాచారం. దీంతో జీతాలు, అప్పులకు కిస్తీలు చెల్లించిన తర్వాత రైతుభరోసాకు కావాల్సిన నిధులను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమైనట్టు తెలిసింది. మొత్తం మూడు విడతల్లో యాసంగి రైతు భరోసా నిధులను జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో భాగంగా మార్చి 22న ఎకరం వరకు రూ.3,590 కోట్లను 70 లక్షల మంది రైతుల అకౌంట్లలో జమ చేసింది. రెండో విడత నిధులను ఈనెల 2వ వారంలో జమచేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఈసారి ఎకరం కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు నిధులు జమ అవుతాయి. దాదాపు 5 ఎకరాల విస్తీర్ణం వరకు రెండో దఫాలో నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసినట్టు తెలిసింది. ఆపైన భూమి ఉన్న రైతులకు కావాల్సిన నిధులను ఈనెల చివరన చెల్లించాలని భావిస్తున్నది. ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.6వేల చొప్పున పంటసాగు కోసం రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తున్నది. అందుకోసం రూ.9 వేల కోట్లు అవసరం అవుతున్నాయి. ఆర్థిక వనరుల కొరత కారణంగా మూడు దఫాలుగా ఇవ్వాలని ప్రభుత్వం ప్లాన్ చేసింది.

# ఏప్రిల్ 'ఫూల్స్' నెల కాదు.. ఇది సామాజిక విప్లవకారుల 'జ్ఞాన' మాసం





ప్రతి ఏటా ఏప్రిల్ నెల రాగానే 'ఏప్రిల్ ఫూల్' అంటూ ఒకరినొకరు మోసం చేసుకోవడం, వెక్కిరించుకోవడం ఒక అశాస్త్రీయ ఆచారంగా మారిపోయింది. కానీ, చరిత్రను లోతుగా పరిశీలిస్తే.. ఈ ఏప్రిల్ నెల భారతదేశ సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత వ్యక్తుల జన్మదినాలతో పునీతమైంది. మూఢనమ్మకాల చీకట్లను చీల్చి, అణగారిన వర్గాల జీవితాల్లో విజ్ఞానపు వెలుగులు నింపిన మహనీయులు పుట్టిన ఈ నెలను మనం 'సామాజిక చైతన్య మాసం'గా జరుపుకోవాలి.

ఏప్రియల్ నెలలోని సామాజిక విప్లవమూర్తులు

1. బాబు జగ్‌జీవన్ రామ్ జయంతి (ఏప్రిల్ 5)

అట్టడుగు వర్గాల నుండి ఎదిగి, దేశ రక్షణ మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ధీశాలి బాబూజీ. కుల వివక్షను ఎదిరించి, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి నేటికీ ఆదర్శం.

2. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి (ఏప్రిల్ 11)

భారతదేశంలో సామాజిక విప్లవానికి ఆద్యుడు జ్యోతిరావు పూలే. అంటరానితనం, మూఢాచారాలపై ఆయన చేసిన పోరాటం నిరుపమానం. "విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు" అని చాటిచెప్పిన ఆయన, స్త్రీ విద్య కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించిన యుగపురుషుడు.

3. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)

భారత రాజ్యాంగ నిర్మాత, ఆధునిక భారత నిర్మాణ శిల్పి బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించింది కూడా ఈ నెలలోనే. జ్ఞానానికి నిలువెత్తు రూపమైన ఆయన, కోట్లాది మంది జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే నినాదం నేటికీ మన హేతువాద ఉద్యమాలకు ఊపిరి.

మనం మార్చుకోవాల్సిన దృక్పథం

ఒకవైపు ఇంతటి మహనీయుల స్ఫూర్తి ఉంటే, మరోవైపు సమాజం ఏప్రిల్ 1ని అజ్ఞానంతో 'ఫూల్స్ డే'గా జరుపుకోవడం విచారకరం. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం కార్యకర్తలుగా మన బాధ్యత ఏంటంటే.. ప్రజల్లో ఈ అశాస్త్రీయ భావజాలాన్ని తొలగించడం. ఏప్రిల్ నెలను అజ్ఞానానికి ప్రతీకగా కాకుండా, అంబేద్కరిజం, పూలే ఆశయాల సాక్షిగా 'విజ్ఞాన మాసం'గా గుర్తించాలి.



గుర్రాల నాగరాజు జర్నలిస్ట్ (MA,PGDJ)
మూడ నమ్మకాల నిర్మూలన సంఘం (ఏం ఎన్ ఎస్)
తెలంగాణ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ
యాదాద్రి భువనగిరి జిల్లా-9573188975

ఏప్రియల్ మాసం అంటే జ్ఞాన మాసం అని గుర్తించుకుంధాం

మహనీయులు మనకు అందించిన అతిపెద్ద ఆయుధం 'శాస్త్రీయ దృక్పథం'. ఈ ఏప్రిల్ నెలలో వారిని స్మరించుకుంటూ.. సమాజంలో పేరుకుపోయిన కులతత్వం, మతతత్వం, మూఢనమ్మకాలను పారద్రోలి, ఒక సమ సమాజాన్ని నిర్మించడానికి మనమంతా కంకణం కట్టుకుందాం. అప్పుడే ఈ నెలకు, ఆ మహనీయుల జన్మదినాలకు నిజమైన సార్థకత లభిస్తుంది.

# యస్.బి.ఐ.టి. లో అట్టహాసంగా ఆరోహన్ - 26

## ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు.

## ముఖ్య అతిథిగా హాజరైన డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్. రామస్వామి




ఖమ్మం, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఖమ్మం యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన, ఆరోహన్ - 2026 విద్యార్థుల కేరింతల నడుమ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో 40 కి పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి, వాటి పనితీరు గురించి పూర్తిగా వివరించారు. తొలుత ఆరోహన్ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఒ, డి.జి.యమ్ భారత్ డైనమిక్స్ లిమిటిట్ డిప్యూటి జనరల్ మేనేజర్ రామస్వామి సౌందర్యరాజన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా స్వాగత నృత్యంతో ప్రారంభమైన, ఈ కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ, ప్రస్తుత కృతిమ మేధస్సు యుగంలో ఉద్యోగభద్రత, ఉద్యోగాలపై ఆందోళన ఉన్న నేపద్యంలో కృతిమ మేధస్సుకు సరియైన సమాధానం మానవ మేధస్సే అని అన్నారు. మానవ మేధస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తే విద్యార్థుకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుత యుగంలో డ్రోన్ టెక్నాలజి బహుళప్రయోజనాలను సమకూరుస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, నూతన ఆవిష్కరణల కోసం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాకథాన్, ఐడియాథాన్ వంటి పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తూన్నారని తెలిపారు. దీనికంతటికి రోజురోజుకి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తాము శిక్షణను ఇవ్వడమే కారణమని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి.ధాత్రి మట్లాడుతూ, విద్యార్థులు వారి సొంత ఆలోచనలతో భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆలోచనలతో ఆరోహన్ 2026 సందర్భంగా ప్రాజెక్ట్ ఎక్స్‌ఫోలను ప్రదర్శించటం కళాశాలకు గర్వకారణమన్నారు. వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ, రోబోటెక్నాలజీలో ఈ ఆరోహన్ ప్రారంభ ఉత్సవాలు నిర్వహించడం కళాశాలకు ఉన్న సాంకేతిక సత్తాను తెలియచేస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఆరోహన్ 2026 టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా ఇతర కళాశాలల నుండి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని పోటీతత్వాన్ని చాటారన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన చేసారని ఆయన వెల్లడించారు. ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఆరోహన్ 2026 టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 40 ప్రాజెక్టులు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వివరణలో ప్రారంభం నుంచి, ఏవిధమైన టెక్నికల్ విధానాన్ని అవలంభించారో వంటి వివరాలు అతిధులు తెలుసుకొని వారిని అభినందించారు. అనంతరం వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో జరిగిన సాంకేతిక పోటీలైన కోడ్ డిబగ్గింగ్, సర్క్యూట్రిక్స్, క్విజ్, యంగ్ మేనేజర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: ఖమ్మం, యస్.బి.ఐ.టి. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆరోహన్ టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా, విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్లాసికల్, వెస్టన్, బ్రేక్ తదితర నృత్యాలు ప్రదర్శించి చూపరులను మైమరింపచేసారు. అదేవిధంగా గ్రూప్ డ్యాన్స్‌లతో కూడా విద్యార్థులను హోరెత్తించారు. మొత్తం మీద ఆరోహన్ 2026 కార్యక్రమం విద్యార్థుల కేరింతల నడుమ వారికి ఆనందాన్ని ఇస్తూ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా.ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగ మజ్జిగ పంపిణీ చేసిన ముస్లిం సోదరులు



కూకట్ పల్లి, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కే పి హెచ్ బి కాలనీ లో హనుమాన్ జయంతి సందర్భంగా రామసేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ లో నిర్వహించిన హనుమాన్ విరాట్ శోభాయాత్ర 2026 లో బాగంగా రామ్ సేన తో మేము సైతం అంటూ కూకట్ పల్లి కెపిహెచ్ బి ముస్లిం మైనారిటీ సభ్యులు శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ శోభయాత్ర కు విచ్చేసిన భక్తులకు సుమారు 1000 మందికి పైగా వాటర్ బాటిల్స్, మరియు చల్లటి మజ్జిగా పంపిణీ చేయడం జరిగింది. కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ ,మరియు నూర్ భాషా దూదేకుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు భాషా ను మరియు టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ ను మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విలేకరులను డిసిపి రితీరాజ్, మరియు కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ సేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రలో పాల్గొన్న భక్తులకు వాటర్ బాటిల్స్ మరియు మజ్జిగ అందించడమే కాక ప్రతి ఒక్క హిందు సోదరుని ఆప్యాయతంగా పలకరించి అలాయ్ బలాయ్ కలవడం జరిగినది, భాషా ,షేక్ సత్తార్ మాట్లాడుతూ ఆసియా లోనే అతిపెద్ద కాలనీ గా పేరుపొందిన కె పి హెచ్ బి కాలనీ లో కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసి జరుపుకుంటామని తెలియజేశారు. ఈ శుభ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హనుమాన్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ నల్గొండ గద్దర్ నరసన్న, స్థానికులు మహబూబ్ (కచ్చిన్), సీనియర్ విలేకరులు కరీం, నజీర్ ,గంగన్న , చంద్ర, రాము, రెహ్మాన్, ప్రవీణ్, షబ్బీర్, శివ ,శ్యాం సుందర్, క్రాంతి కుమార్, బాల కృష్ణ, సునీల్ , మహమ్మద్ హుస్సేన్ , చాంద్ తదితరులు పాల్గొన్నారు.


# నూతన కమిటీ సభ్యులను సన్మానించిన కోలన్ హన్మంత్ రెడ్డి




కుత్బుల్లాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతనంగా నియమితులైన సభ్యులు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఆమోదంతో, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యం రెడ్డి, బుయ్యని శివ కుమార్; జనరల్ సెక్రటరీలుగా బైరి ప్రశాంత్ గౌడ్, సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి; సెక్రటరీలుగా పందరి రావు, గణేష్, కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మి చౌదరి, కరణ్, ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవారు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంచందర్, హరి కిరణ్ పటేల్, చందు, రాజు చారి, తైలం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, హన్మి రెడ్డి, సత్తి రెడ్డి, నాగేంద్ర, అనిల్, శైలజ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య కు నివాళులు అర్పించిన

## టి.జి.బి.ఇ.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శోభనాయక్



ఖమ్మం, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బహుజన వీరుడు దొడ్డి కొమరయ్య యాదవ్ 99వ జయంతి సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన, కార్యక్రమానికి బీ.సీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జయంతోత్సవానికి అతిథులుగా ఆహ్వానించగా, ఈ కార్యక్రమానికి తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శోభన్ నాయక్ వెళ్లి, స్వర్గీయ దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కురాకుల నాగభూషణం యాదవ్ మాజీ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బహుజన కులాల సమన్వయకర్త తెలంగాణ గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, మహాత్మ జ్యోతిబాపూలే ఐడియాలజీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పెల్లూరి విజయ్ కుమార్, భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.డి సాధిక్ అలీ, బహుజనుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ తదితర బహుజన నాయకులు హాజరై ఆ మహనీయునికి ఘనమైన నివాళులు అర్పించారు.

# దొడ్డి కొముర‌య్య స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో



మహబూబాబాద్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మెరకు తెలంగాణ సాయుధ పోరాటలో తొలి అమరుడు అయన దొడ్డి కొమరయ్య జయంతి గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అదనపు కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమము నిర్వహించిన జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు, ఐ.డి. ఓ.సి కార్యాలయ సిబ్బంది,మరియు జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న గ్రామ సర్పంచ్ లహరిక



ఖానాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెన్ ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆగి ఉన్న ట్రాక్టర్ నాగళ్లకు ఢీకొని మరో ప్రమాదం సంభవించింది . ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరిపీల్చున్నారు. ఆమెను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సర్పంచ్ లహరిక (31)మృతి చెందింది. ఆమెకు భర్త రాజేష్, కొడుకు, కూతురు ఉన్నారు. సర్పంచు లహరిక ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అని పోలీసులు విచారణ చేపట్టారు. లహరిక మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీస్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కేసీఆర్ కాళ్లు పట్టుకునైనా సరే.. నీ ఇంటి సంగతి చూస్తా

## బందరు అసిస్టెంట్ కమిషనర్‌కు పేర్ని నాని వార్నింగ్



ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏపీలోని మచిలీపట్నంలో మున్సిపల్ అధికారులు ఇళ్లను కూల్చివేయడంపై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని నిప్పులు చెరిగారు. మంత్రి కొల్లు రవీంద్రకు తొత్తులగా పనిచేస్తూ.. నోటీసులు ఇవ్వకుండానే ప్రజల ఇళ్లను కూల్చడంపై మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు మీద ఆగ్రహం వ్యక్తంచేశారు. 2029లో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సంగతి చూస్తానని బెదిరించారు.

కొల్లు రవీంద్రకు తొత్తులగా పనిచేసే ఏ ఒక్క అధికారిని కూడా వదిలిపెట్టేది లేదని పేర్ని నాని వార్నింగ్ ఇచ్చారు. కొల్లు రవీంద్ర గుర్తుపెట్టుకో.. నువ్వు చెప్పావని ఇల్లు కూల్చేందుకు కాపలాగా వచ్చిన సీఐ, ఎస్సైలను మళ్లీ బందరు తీసుకొస్తా.. వాళ్లనే కాపలాగా పెట్టి.. నీకు ఇలాగే చూపిస్తానని హెచ్చరించారు. ఇప్పుడు ఇళ్లను కూల్చేందుకు వచ్చిన అధికారులను ఎవరినీ వదలమని.. వాళ్ల సంతి చూస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వారిని బందరు తీసుకొచ్చి మరీ కొల్లు రవీంద్ర ఇంటిని కూల్చేస్తామని అన్నారు. జేసీబీలు, గునపాలు తిగితే ఎలా ఉంటుందో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు చైదరికి తెలిసేలా చేస్తానని తేల్చిచెప్పారు.

బందరు నుంచి వెళ్లిపోయి.. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా అసిస్టెంట్ కమిషనర్ గోపాల్‌రావు ఇంటి సంగతి చూస్తానని అన్నారు. తెలంగాణకు పోయినా.. కేసీఆర్ కాళ్లు పట్టుకుని.. నిన్ను తీసుకొచ్చి మరీ నీ ఇంటి సంగతి తేలుస్తానని వార్నింగ్ ఇచ్చారు. ఇక ఏసీపీ ఇంటికి కూడా ప్లాన్ లేదని ఆయన ఇంటి సంగతి కూడా చూస్తానని హెచ్చరించారు.

# తెలంగాణకు నేను వ్యతిరేకం కాదు..ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను!




ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరామని, రాజధాని లేకుండా ఏపీని విభజించారన్నారు. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే తాను ప్రమాణం చేస్తానని చెప్పానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. పుష్కరకాలం కింద అమరావతిని రాజధానిగా నిర్ణయించామని, అది ఇప్పుడు చట్టబద్ధత పొందిందని సీఎం పేర్కొన్నారు.

ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రజలకి ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఈ కార్యక్రమం పెట్టాను. అమరావతిని చట్టం చేసి 12సంవత్సరాలు అయ్యింది. రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడం ప్రజా విజయంగా భావిస్తున్నా. పార్లమెంట్లో 10 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మిగిలిన పార్టీలు పరోక్షంగా మద్దతు పలికారు. లోక్ సభలో 41 పార్టీలు ఉన్నాయి. 9 పార్టీలు రాజ్యసభలో ఉన్నాయి. అన్ని కలిపి 50 పార్టీలు. నేరుగా చాలా మంది సహకరించారు. ఒకే ఒక్క పార్టీ వైసీపీ మాత్రం ఈ రాష్ట్రానికి ద్రోహం చేసే ప్రయత్నం చేసింది. 2024 జూన్ 2 నుంచి అమరావతి రాజధానిగా శాశ్వతంగా ఉంటుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా వస్తుంది. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా. ప్రధాని అన్ని విధాలుగా సహకరించారు' అని సీఎం చెప్పారు.

'అమరావతి రాజధానిగా ఉండాలని దేశ ప్రయోజనాల కోసం చాలా పార్టీలు ఆలోచించాయి. కానీ వైసీపీ మాత్రం అమరావతిని నాశనం చేయాలని చూసారు. కుట్ర దాటి అమరావతి గెలిచింది. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరిన సందర్భం ఇది. భవిష్యత్లో ఎవరు ఏమి చెయలేని విధంగా జరిగింది. రెండు ప్రాంతాలు సమన్వయం చేయాలనీ ఆనాడు తెలియచేసా. పరిష్కారం కాకుండా విభజన జరిగింది. పోలవరం ఒక సంకల్పం. ఒక 7 మండలాలు తెలంగాణాలో కలిపారు. కానీ ఆనాడు 7 మండలాలు ఏపీకి ఇవ్వాలని ప్రధాని మోడీని కోరాను. నేనెప్పుడూ తెలంగాణాకి వ్యతిరేకిని కాదు. విభజిత ఏపీలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇరిగేషన్ కార్యాలయానికి బస్సులో బస చేశా. శివరామక్రిష్ణ కమిటీ రాష్ట్ర రాజధాని కోసం తిరగడం జరిగింది. గుంటూరు విజయవాడ రాజధాని అయితే సిఫార్సు చేసారు. అప్పుడు వైసీపీ నాయకులూ విన్యాసాలు వేసి అందరిని రెచ్చగొట్టారు. అధికార వికేంద్రికరణ చేస్తూనే భవిష్యత్ కోసం ఒక సంకల్పం చేసాము. రెండు ప్రాంతాలకి సమాన దూరం ఉండేలా ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసాము' అని సీఎం తెలిపారు.


# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రైతులకు శుభవార్త చెప్పింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. రేపటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు మంత్రి నాదెండ్ల మనోహర్..

# రికార్డు సమయంలో పూర్తి చేస్తాం మూలపేట పోర్టు పనులపై మంత్రి కీలక వ్యాఖ్యలు






ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మూలపేట పోర్టు నిర్మాణ పనుల్లో గత ప్రభుత్వానిది నత్తనడక అయితే మన ప్రభుత్వానిది జెట్ స్పీడ్ అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పనుల ఆలస్యంపై వైసీపీ నాయకులు చేసిన విమర్శలకు ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మే 2024 నాటికి ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి మార్చి 2026 నాటికి మనం సాధించిన ప్రగతి ఏమిటనేది గణాంకాలే సాక్ష్యమన్నారు. దక్షిణ బ్రేక్ వాటర్ పనులు మే 2024 నాటికి కేవలం 1750 మీటర్ల కోర్ ప్లేసింగ్ పనులు పురోగతిలో ఉండగా మార్చి 2026 నాటికి 26.20 లక్షల మెట్రిక్ టన్నుల రాక్ ప్లేసింగ్ 47766 కాంక్రీట్ ఆర్మర్ కాస్టింగ్, ప్లేసింగ్ పనులు పూర్తి చేశామని చెప్పారు. ఉత్తర బ్రేక్ వాటర్స్ విషయానికి వస్తే మే 2024 నాటికి కేవలం 580 మీటర్ల కోర్ ప్లేసింగ్ పనులు జరిగితే అదే మార్చి 2026 నాటికి 2.62 లక్షల మెట్రిక్ టన్నుల రాక్ ప్లేసింగ్ 6674 కాంక్రీట్ ఆర్మర్ యూనిట్ల కాస్టింగ్, ప్లేసింగ్ పనులు వంద శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

వేగవంతం చేశాం..

"జనరల్ కార్గో బెర్త్ పనులు మే 2024 నాటికి పైలింగ్, బీమ్ పనులు పురోగతిలో ఉండగా మార్చి 2026 నాటికి పైల్స్ డి-వాల్, ప్రీకాస్ట్ యూనిట్లు పూర్తి చేసి ఇన్-సిటు బీమ్స్, స్లాబ్ పనులు వేగవంతం చేశాం. కోల్ బెర్త్ పనులు మే 2024 నాటికి అసలు ప్రారంభమే కాలేదు కానీ మార్చి 2026 నాటికి 40 పైల్స్ 995 ప్రీకాస్ట్ యూనిట్ల కాస్టింగ్, 59 యూనిట్ల ప్లేసింగ్ పనులు పూర్తి చేశాం. ఆన్-షోర్ ఇన్ఫ్రా పనులు మే 2024 నాటికి ప్రారంభం కాకపోయినా మార్చి 2026 నాటికి క్యాంటీన్ కస్టమ్స్ బిల్డింగ్, గేట్ కాంప్లెక్స్‌ల రూఫ్ స్లాబ్ పనులు పూర్తి చేశాం." అని మంత్రి అచ్చెన్న వెల్లడించారు.

రికార్డు సమయంలో పూర్తి చేస్తాం:

"ఎక్స్టర్నల్ రోడ్ ఎంబ్యాంక్మెంట్ పనులు మే 2024 నాటికి కేవలం 6.80 శాతం మాత్రమే ఉంటే మార్చి 2026 నాటికి సబ్-గ్రేడ్ జిఎస్‌బి డబ్ల్యూఎమ్‌ఎమ్, స్ట్రక్చర్ పనులతో కలిపి మొత్తం 30.87 శాతం పనులు పూర్తి చేశాం. మేజర్ బ్రిడ్జి రైల్ ఎంబ్యాంక్మెంట్, ఎక్స్టర్నల్ వాటర్ సప్లై పనులు మే 2024 నాటికి ప్రారంభం కానప్పటికీ మార్చి 2026 నాటికి బ్రిడ్జి పైల్ క్యాప్ పనులు 22.04 శాతం రైల్ ఎంబ్యాంక్మెంట్ పనులు, 19.97 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు పూర్తి చేశాం. ఇచ్చిన మాట ప్రకారం ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే మూలపేట పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేస్తాం." అని మంత్రి అచ్చెన్న ధీమా వ్యక్తం చేశారు.

# పండగలో వ్యక్తిని కొట్టిన అయ్యన్న రాజకీయం చేయవద్దంటూ బాధితుడు రిక్వెస్ట్



ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నర్సీపట్నం పండగ లో జరిగిన ఘటనను రాజకీయం చేయొద్దని ఎత్తుల భాస్కరరావు అన్నారు. పండగలో డప్పు కొడుతుండగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేయిచేసుకున్న ఘటనపై ఆయన స్పందించారు. దళితుడు అని తన పేరు చెప్పి వైసీపీ రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. తన చిన్నప్పటి నుంచి తాము అయ్యన్నపాత్రుడు వద్దే ఒకే కుటుంబంగా ఉంటున్నామని తెలిపారు. జాతరను అయ్యన్నపాత్రుడు చాలా గొప్పగా జరిపించారన్నారు. అందరూ జాతర గురించి గొప్పగా చెప్పుకుంటున్నారని చెప్పారు. ఆ జాతరను రాజకీయం చేయవద్దని రిక్వెస్ట్ చేశారు. తన వల్ల అయ్యన్న పాత్రుడి కాలుకి దెబ్బ తగిలిందని, ఈ నేపథ్యంలోనే తనపై చేయిచేసుకున్నారని ఎత్తుల భాస్కర్ రావు చెప్పారు.

# నడిరోడ్డుపై హర్షవీణపై దాడి..

## జనసేన నాయకుడు నాగేంద్రపై ఎస్సీ, ఎస్టీ కేసు



ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అనుచరుడు, జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్రపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు హర్ష వీణ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. తనకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన హర్ష వీణపై జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర లాఠీతో దాడిచేశారు. పోలీసులు అక్కడ ఉండగానే నడిరోడ్డుపై అమానుషంగా ప్రవర్తించారు. దీంతో న్యాయవాదితో కలిసి రైల్వేకోడూరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాగేంద్రతోపాటు మరికొందరిపైనా పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేశారు.

అయితే హర్షవీణపై దాడి జరిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అనుచరుడు నాగేంద్రపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో అటు పోలీసులపైనా నెటిజన్లు నెగిటివ్ పోస్టులు పెడుతున్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో బాధింపబడిన హర్షవీణకు న్యాయం చేయకపోగా పోలీసుల కల్లెదుటే దాడి జరగడం అమానుషమని విమర్శలు చేస్తున్నారు.

# మాచర్ల అత్యాచారం ఘటన.. సీసీటీవీ దృశ్యాల్లో కీలక ఆధారాలు

ఏపీ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పల్నాడు జిల్లా మాచర్లను వణికించిన అత్యాచార ఘటనలో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యంత్రాంగం.. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారితో ప్రత్యేక విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఘటనాస్థలం సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు, అందులో ఒక అనుమానితుడిని గుర్తించినట్లు సమాచారం. ఈ ఆధారాలతో నిందితుడికి పోలీసులు చాలా దగ్గరగా ఉన్నట్లు తెలుస్తోంది...

మరోవైపు క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఘటనాస్థలంలో కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. నిందితుడి ఆచూకీ కనిపెట్టి త్వరితగతిన అరెస్టు చేసేందుకు పలు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బాధితురాలికి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తూ, ఎక్కడా లొసుగులు లేకుండా విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. కాగా సత్తెనపల్లి చెందిన మహిళ ఉద్యోగరీత్యా మాచర్లలో నివాసముంటున్నారు. అయితే ఒంటరిగా ఉంటున్న ఆమె గుడ్ ఫ్రైడే సందర్భంగా సత్తెనపల్లికి వెళ్లే ప్రయత్నం ఉన్నారు. ఈ సమయంలో ఓ వ్యక్తి ఇంటి వద్దకు బయట ఎండ తీవ్రత చాలా ఉందని, కొంచెం మంచినీళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఆమె ఇంట్లోకి వెళ్లిన వెంటనే దుండగుడూ చొరబడ్డారు. కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సమయంలో ఆమె నోట్లో గుడ్డలు కుక్కి కాళ్లు, చేతులు కట్టేసి అత్యంత పాశవికంగా ప్రవర్తించారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఈ ఘటన మాచర్ల వ్యాప్తంగా సంచలనంగా మారింది.

## తమ పుట్టినరోజు సందర్బంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ని మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): 131 డివిజన్ కు చెందిన సీనియర్ నాయకులు కిషోర్ చారి, మధుకర్ రెడ్డి లతో పాటుగా 126 – జగద్గిరిగుట్ట డివిజన్ కు చెందిన నాయకులు శశిధర్, వారి పుట్టినరోజు సందర్బంగా కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్బంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, పుట్టినరోజు జరుకుంటున్న కిషోర్ చారి, మధుకర్ రెడ్డి లో, శశిధర్ లను శాలువాలతో సత్కరించి "ప్రజల సంక్షేమం, బస్తీ, ఆయా డివిజన్ల అభివృద్ధిలో మరింత చురుకుగా పాల్గొనేలా ఆ దేవుడు వారికీ సంపూర్ణ జీవితం ప్రసాదించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, డివిజన్ కు చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర శుక్రవారం సందర్భంగా సెయింట్ పాల్స్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు

### విచారణ గురువులు పసల అమర్ ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహణ



తొర్రూరు, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పవిత్ర శుక్రవారం సందర్భంగా సెయింట్ పాల్స్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి. రేవరెండ్ ఫాదర్ పసల అమర్ ఆధ్వర్యంలో చర్చ్ ప్రాంగణంలో 'సిలువ మార్గం' నిర్వహించబడింది. యేసు ప్రభువు అనుభవించిన 14 స్థితులను ప్రతిబింబిస్తూ ప్రతి స్థానం వద్ద ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ వచన పఠనం, ధ్యాన సందేశాలు నిర్వహించారు. ప్రార్థనా సభలో విచారణ గురువులు పసల అమర్ సందేశం అందిస్తూ, పవిత్ర శుక్రవారం క్రైస్తవ విశ్వాసంలో అత్యంత ప్రాధాన్యమైన రోజని, యేసు క్రీస్తు మానవాళి పాప విమోచన కోసం సిలువపై త్యాగం చేసిన దినంగా స్మరించుకుంటారని అన్నారు. యేసు క్రీస్తు త్యాగం ప్రేమ, క్షమ, సేవ భావాల ప్రతీకని పేర్కొన్నారు. సమాజంలో ద్వేషం, అసహనం, విభేదాలకు తావులేకుండా ప్రేమతో, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం శాంతి, పరస్పర గౌరవం, సేవా భావంతో ముందుకు సాగితే సమాజం సుభిక్షంగా మారుతుందని తెలిపారు. ప్రార్థనల సందర్భంగా విశ్వాసులు ధ్యానం చేస్తూ యేసు ప్రభువు అనుభవించిన బాధలను స్మరించుకున్నారు. కార్యక్రమం ముగింపులో ప్రపంచ శాంతి, దేశ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర శుక్రవారం సందేశం మన జీవితాల్లో మార్పు తీసుకురావాలని విశ్వాసులు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో కన్యస్త్రీలు, మత విశ్వాసులు, యువత, మహిళా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత గంభీరంగా తీర్చిదిద్దారు.

## లోకోస్ యాప్ ద్వారా సంఘాల లావాదేవీల నమోదు



ధర్మసాగర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో గ్రామైక్య సంఘాల కార్యకలాపాలపై సెర్ఫ్ ఐబీ డైరెక్టర్ నవీన్ పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలోని నాలుగు గ్రామైక్య సంఘాలలో లోకోస్ యాప్‌లో సంఘాల ప్రొఫైల్‌లు,లావాదేవీల నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ,లోకోస్"యాప్‌లో" వివరాల నమోదు సమయంలో ఎదురవుతున్న టెక్నికల్ సమస్యల గురించి,ఎలక్ట్రానిక్ మాస్టర్ బుక్ కీపింగ్ ట్రైనర్స్ ని అడిగి తెలుసుకున్నారు.యాప్ వినియోగం ద్వారా సంఘాల పనితీరు మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా ఉండాలని తెలిపారు.ఈ సందర్భంగా పెద్ద పెండ్యాల గ్రామంలోని సీఏలు, వివోఏలతో సమావేశమై, సమైక్య సంఘాల లావాదేవీల నిర్వహణ,సభ్యులు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామైక్య సంఘాలకు అందుతున్న నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మండలం ఏపిఎం మహేందర్, లోకోస్ యాప్ శిక్షకులు బైరి రమేష్, సానిక ఉమేందర్, ఈఎంటిలు సంజీవరెడ్డి,రాజేశ్వర్ రెడ్డి,శిక్షణ పొందుతున్న ఈఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెం లో ఆర్.సి.ఎం చర్చి నందు ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు





ఖమ్మం/రఘునాథపాలెం, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రఘునాథపాలెం లో ఆర్.సి.ఎం చర్చి నందు, గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్.సి.ఏం విచారణ కర్త రెవరెండ్, ఫాదర్ కొమరవెల్లి జోసెఫ్ ఆధ్వర్యంలో సిలువ మార్గం జరిగింది. ఆ తరువాత ఫాదర్ తన సందేశాన్ని అందించారు. ఏసుక్రీస్తు పాపుల కొరకు తన శరీరం మీద పాపాలను మోసి ఉన్నాడని, తన మరణం ద్వారా పాప క్షమాపణ అనుగ్రహించాడు అని, అదేవిధంగా మనుషుల పాప విమోచన కొరకుఏసుక్రీస్తు, సిలువపై ప్రాణ త్యాగం చేసిన పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే అని, ఆయన పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలిగి యున్నదని, సర్వోన్నతుడైన దేవుని కుమారుడు, తనను తాను తగ్గించుకొని, రిక్తినిగ భూమికి వచ్చి సమస్త మానవాళి పాప పరిహార్థమై సిలువలో బలి యాగమైన లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని బోధించారు. ఈ గుడ్ ఫ్రైడే వేడుకల్లో రఘునాథపాలెం గ్రామం తో పాటు, చింత గుత్తి గ్రామం, కోయచిలక, వేపకుంట్ల గ్రామస్తులు మరియు రఘునాథపాలెం గ్రామ సర్పంచ్ గాజుల కృష్ణారావు తో పాటు గాజులు ముత్తయ్య, నరసింహారావు,తురుగంటి సురేష్, గొడ్డ లాలేశ్వరరావు, సంఘస్తులు

## హనుమాన్ జయంతి సందర్బంగా హనుమాన్ చాలీసా పారాయణం యోగ గురువు కౌడ మల్లేష్



కుత్బుల్లాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): హనుమాన్ విజయోత్యవం పౌర్ణమి సందర్భంగా షాపూర్ నగర్ లొ శివ శక్తి ధ్యాన యోగ కళ క్షేత్ర ఆధ్వర్యంలో సాయంత్రం భజన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణము జరిగింది హనుమాన్ వైభవం మీద ప్రసంగించడం జరిగింది ఉడుత భక్తిగా వచ్చిన ప్రతి భక్తులకు హనుమాన్ చాలీసా పుస్తకం ఇవ్వడం జరిగింది తదుపరి స్వామి వారిని భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఈ భక్తి పూర్వకంగా జరిగిన కార్య క్రమం లో శివ శక్తి ధ్యాన యోగ వ్యవస్థాపకులు యోగ గురు . కౌడ మల్లేష్, శివ శక్తి ధ్యాన యోగ యోగ కూచిపూడి సత్సంగం భక్తులు పాల్గొన్నారు పాల్గొన్న వారికి సేవ చేసిన వారికి ఆంజనేయ స్వామి ఆశీర్వాదం ఉండాలని ప్రార్థన చేయడం జరిగింది ఈకార్యక్రమంలో పలు కాలనీ వాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర ద్వారంపూడి నాగిరెడ్డి



కుత్బుల్లాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సుభాష్ నగర్ పరిధిలోని వినాయక నగర్ లో హనుమాన్ జయంతి సందర్భంగా ముఖ్య అతిధి గా వచ్చిన సుభాష్ నగర్ కాంగ్రెస్ పార్టీ జెనరల్ సెక్రటరీ ద్వారంపూడి నాగిరెడ్డి, వచ్చి ర్యాలీ ని ప్రారంభ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ నన్ను ఈ ప్రోగ్రాంకు పిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ ప్రోగ్రాం శక్తి యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ద్వారపూడి నాగిరెడ్డి,ఆక్టివ్ మెంబర్ బిజిలి శ్రీరామ్, బి ఎస్ ఎస్, రిషి పాండే, వారి టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈకార్యక్రమంలో పలు నాయకులు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మానవ సేవయే మాధవ సేవగా చలివేంద్రాల ఏర్పాటు జరగాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్




కుత్బుల్లాపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): గాజుల రామారం 125 డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ లో శ్రీ లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివెంద్రాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా దాహార్తిని తీర్చడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ లలితా భక్త మండలి సభ్యులు ప్రమీలా, లక్ష్మీ సామ్రాజ్యం, విజయలక్ష్మి, కళ్యాణి, అనిత, ధనలక్ష్మి, సంధ్య, సుమతి, అరుణ, భారతి, కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య చౌదరి, పానకాలు, సుమన్, మహేష్, మధుసూదన్ రావు, మూర్తి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్న చౌదరి, రాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, నవీన్ దండుగుల, మల్లేష్, సంగమేష్, ప్రసాద్, శివా నాయక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో

### గుండుమాల్ గ్రామం ఏ.కె. స్పోర్ట్స్ అకాడమీ గర్ల్స్‌కు మూడో బహుమతి



నారాయణపేట, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రంగారెడ్డి జిల్లా నిడదవెల్లి గ్రామంలో నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ గర్ల్స్ సీనియర్ వాలీబాల్ టోర్నమెంట్‌లో గుండుమాల్ గ్రామానికి చెందిన ఏ.కె. స్పోర్ట్స్ అకాడమీ గర్ల్స్ జట్టు ప్రతిభ కనబరిచి మూడవ బహుమతిని సాధించింది. ఈ పోటీలో నిడదవెల్లి లోకల్ జట్టుతో పోటీ పడిన గుండుమాల్ జట్టు అద్భుత ఆటతీరు ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలో స్థానాన్ని దక్కించుకుంది ఈ విజయంపై ఏ.కె. స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అంజయ్య యాదవ్, కోచ్ మహమ్మద్ సాదిక్ గర్ల్స్ జట్టును అభినందించారు. అలాగే ఈ విజయానికి తోడ్పడిన గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనపూర్ రైల్వే స్టేషన్ వద్ద 46 కిలోల గంజాయి స్వాధీనం - ఇద్దరు అరెస్ట్





ఘనపూర్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీగా గంజాయి పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఏప్రిల్ 2న మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఎస్.ఐ రాజేష్ పిట్ట తన సిబ్బందితో కలిసి ఘనపూర్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఘనపూర్ రైల్వే స్టేషన్ వద్ద ఒక పురుషుడు, ఒక మహిళ ఐదు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. పోలీసులు వారిని ప్రశ్నించేందుకు వెళ్లగా,వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించారు.వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని బ్యాగులను తనిఖీ చేయగా, అందులో మొత్తం 46.85 కిలోల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా,తమ పేర్లు సత్యరంజన్ బారెల్,దీప్తి మాయి స్వైన్ అని తెలిపారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి ముంబయి దాదర్ ప్రాంతానికి గంజాయిని అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు,ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వారి వద్ద నుండి 46.4 కిలోల గంజాయి,రెండు మొబైల్ ఫోన్లు,రూ. 2,690 నగదు,ట్రైన్ టికెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన గంజాయి విలువ సుమారు రూ. 23.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

## లింగంపల్లి గ్రామంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు ఘనంగా



నవాబుపేట, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): లింగంపల్లి గ్రామంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కురుమ సంఘం నాయకులు మాట్లాడారు. దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ పోరాటాల్లో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని, ఆయన చేసిన త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. రైతుల హక్కుల కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి ప్రతి యువకుడికి ఆదర్శమని, సమాజంలో అన్యాయం జరిగితే ఎదిరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కొమరయ్య ఆశయాలను కొనసాగించాలని, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చివరగా పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

## పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి



ఇనుగుర్తి, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఇనుగుర్తి మండలం లోని చిన్నముప్పారం గ్రామంలో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం కొమురయ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటం చేసిన యోధుడు కొమురయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ స్టార్ యూత్ అధ్యక్షులు జక్కుల కృపాకర్ , యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మెదడుకు అసలైన విశ్రాంతి ఇవ్వడం అంటే ఏంటి.. ఏం చేయాలి..?

హెల్త్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చాలామంది మానసికంగా అలసిపోయాం అని చెబుతుంటారు. అయితే ఈ అనుభూతి నిజమైన అలసట కాకపోవచ్చు. ఎక్కువ సందర్భాల్లో అది జ్ఞానాత్మక ఒత్తిడి (కాగ్నిటివ్ ఓవర్లోడ్) అయి ఉండవచ్చు. ఉదయం లేవగానే మెదడు సమాచారం ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తుంది. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, సంభాషణలు, పనుల గడువులు, చుట్టూ ఉండే శబ్దం, డిజిటల్ కంటెంట్ వంటివన్నీ దృష్టిని ఆకర్షిస్తాయి. శారీరక అలసటలా ఇది స్పష్టంగా కనిపించదు. మెదడు ఇప్పటికే తీసుకున్న సమాచారాన్ని ప్రాసెస్ చేయకముందే మరిన్ని ఇన్‌పుట్‌లను స్వీకరిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఉద్దీపన ప్రభావం కాలక్రమేణా బయటపడుతుంది. దృష్టి లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం, చిరాకు, సృజనాత్మకత తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది దీనిని మెంటల్ డ్రెయిన్ గా భావించినా, అసలు కారణం మెదడుపై అధిక సమాచార భారం పడటమే.




**నిరంతరం పనిచేయదు..**

మనిషి మెదడు నిరంతరం పని చేయడానికి రూపొందించబడలేదు. శరీర కండరాలకు విశ్రాంతి అవసరమైనట్లే, మెదడుకూ విరామం అవసరం. ఈ విరామాలు సమాచారాన్ని సరిచేయడానికి, భావోద్వేగాలను నియంత్రించడానికి, ఆలోచనలను క్రమబద్ధం చేయడానికి సహాయపడతాయి. అయితే చాలామంది సోషల్ మీడియా స్క్రోలింగ్ లేదా టీవీ చూడడాన్ని విశ్రాంతిగా భావిస్తారు. కానీ ఇవి కూడా మెదడును ఉద్దీపన చేస్తాయి. చిత్రాలు, శబ్దాలు, సమాచారం వంటివి మెదడును పనిచేయించే కారణంగా, ఇది నిజమైన విశ్రాంతి కాదని నిపుణులు చెబుతున్నారు.

**ఏం చేయాలి..**

మెదడుకు నిజమైన విశ్రాంతి ఇవ్వాలంటే ఉద్దేశపూర్వకంగా నిశ్శబ్ద సమయాన్ని కేటాయించాలి. నిశ్శబ్దంగా కూర్చోవడం, శ్వాసపై దృష్టి పెట్టడం, ధ్యానం చేయడం, ప్రకృతిలో గడపడం, లేదా ఎలాంటి అంతరాయం లేకుండా ఆలోచనలను స్వేచ్ఛగా ప్రవహించనివ్వడం వంటి చర్యలు మెదడును రీసెట్ చేయడంలో సహాయపడతాయి. అదేవిధంగా నాణ్యమైన నిద్ర కూడా మానసిక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెదడుకు సరైన విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయిస్తే శరీరం స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తూనే ఉంటుంది. దీని వల్ల నర వ్యవస్థ ఎప్పుడూ అప్రమత్త స్థితిలో ఉంటుంది. ఈ ఒత్తిడి తక్కువగా అనిపించినా, దీర్ఘకాలంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరాకు, మతిమరుపు, భావోద్వేగ అలసట వంటి సమస్యలు పెరుగుతాయి. మరోవైపు సమయానుకూలంగా విరామాలు తీసుకుంటే దృష్టి పెరుగుతుంది, భావోద్వేగ స్థిరత్వం మెరుగుపడుతుంది, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యం పెరుగుతుంది.

**అలా చేయడం సోమరితనం కాదు..**

ఎప్పుడూ బిజీగా ఉండడాన్ని గొప్పగా భావించే సమాజంలో కొంతసేపు ఆగడం చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. విశ్రాంతి తీసుకుంటే పనితీరు తగ్గుతుందని భావిస్తారు. కానీ నిజానికి ఇది తప్పు అభిప్రాయమని నిపుణులు చెబుతున్నారు. లోతైన విశ్రాంతి సోమరితనం కాదు, అది మెదడుకు అవసరమైన మద్దతు. శారీరక శ్రమ తర్వాత కండరాలు ఎలా పునరుద్ధరించబడతాయో, అలాగే మెదడుకూ విశ్రాంతి అవసరం. సరైన విశ్రాంతి తీసుకున్నప్పుడు, మనుషులు మరింత ఉత్సాహంతో, స్పష్టమైన ఆలోచనలతో, మెరుగైన పనితీరుతో తిరిగి పనిలోకి ప్రవేశిస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

# ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు సమయం లేకపోతే.. దీన్ని చేసి తీసుకోండి.. 5 నిమిషాల్లోనే అయిపోతుంది..!

హెల్త్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భారతీయుల ఉదయాలు సాధారణంగా ప్రశాంతంగా ఉండవు. బ్యాగులు సిద్ధం చేయడం, త్వరగా స్నానం ముగించడం, ఏదో ఒకటి తిని బయటకు వెళ్లే హడావుడిలో బ్రేక్‌ఫాస్ట్ మొదట ముగిసిపోతుంది. నిలబడి టోస్ట్ తినడం, టీతో బిస్కెట్ తీసుకోవడం లేదా పూర్తిగా బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం సాధారణంగా మారింది. ఫలితంగా ఆఫీసుకు వెళ్లేలోపే ఆకలి వేధిస్తుంది. ఇక ఈ సమస్యకు ఓట్స్-బనానా స్మూతీ సరైన పరిష్కారంగా నిలుస్తోందని చెప్పవచ్చు. ఈ స్మూతీ తయారు చేయడానికి కేవలం ఐదు నిమిషాలు సరిపోతాయి. బాటిల్‌లో తీసుకెళ్లడానికి సులభం, రుచికరంగా ఉండటమే కాకుండా ప్రోటీన్, ఫైబర్, శక్తిని సమృద్ధిగా అందిస్తుంది. మధ్యాహ్నం వరకు ఆకలి లేకుండా ఉంచే సామర్థ్యం దీని ప్రత్యేకత. ఓట్స్, అరటిపండు కలయిక పోషకపరంగా చాలా సమతుల్యంగా ఉంటుంది. ఓట్స్‌లో ఉండే బీటా-గ్లూకాన్ అనే ఫైబర్ శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తూ ఎక్కువసేపు తృప్తిని ఇస్తుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఓట్స్‌లో మంచి స్థాయిలో ప్రోటీన్ కూడా ఉంటుంది.



**శక్తిని, పోషకాలను ఇచ్చే అరటి పండు..**

అలాగే అరటిపండు సహజమైన తీపిని అందించడమే కాకుండా పొటాషియం, త్వరగా శక్తినిచ్చే కార్బోహైడ్రేట్స్‌ను అందిస్తుంది. బాగా పండిన అరటిపండును వాడితే స్మూతీ మరింత రుచిగా ఉంటుంది. ఫ్రీజ్ చేసిన అరటిపండు స్మూతీకి క్రీమీ టెక్చర్ ఇస్తుంది. ఈ స్మూతీని మరింత పోషకవంతంగా చేయాలంటే ప్రోటీన్ మూలాలను జోడించడం అవసరం. పెరుగు లేదా గ్రీక్ యోగర్ట్ మంచి ఎంపిక. ఇవి శరీరానికి అవసరమైన ప్రోటీన్‌తో పాటు జీర్ణక్రియకు కూడా మేలు చేస్తాయి. పీనట్ బటర్ కూడా ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తూ తృప్తిని పెంచుతుంది. పాలు కూడా ఈ స్మూతీలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. సాధారణ పాలు లేదా సోయా పాలు ప్రోటీన్‌ను అందిస్తాయి. వ్యాయామం చేసే వారు వేప్రోటీన్ పౌడర్ కలిపితే మరింత ప్రోటీన్ పొందవచ్చు.

**తయారీ ఇలా..**

స్మూతీ తయారీ విధానం చాలా సులభం. అరటిపండు, ఓట్స్, పెరుగు, పాలు, పీనట్ బటర్, తేనె లేదా బెల్లం పొడి, వెనిల్లా ఎసెన్స్, కొద్దిగా దాల్చిన చెక్క పొడిని తీసుకొని బ్లెండర్‌లో వేసి బాగా మిక్స్ చేయాలి. అవసరమైతే పాలు కొద్దిగా జోడించి గట్టితనం సర్దుబాటు చేసుకోవచ్చు. ఇక ఓట్స్‌ను ముందుగా కొద్దిసేపు నానబెట్టడం వల్ల స్మూతీ మరింత మృదువుగా తయారవుతుంది. రాత్రే పాలు లేదా పెరుగులో నానబెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే ఉదయం త్వరగా తయారు చేసుకోవచ్చు. అంతేకాకుండా ఈ స్మూతీకి పలు వెరియేషన్లు కూడా ఉన్నాయి.

**ఫ్లేవర్లలోనూ తయారీ..**

కోకో పౌడర్ కలిపితే చాక్లెట్ ఫ్లేవర్ వస్తుంది. మామిడి ముక్కలు జోడిస్తే మామిడి లస్సీ తరహా రుచిని ఇస్తుంది. చియా సీడ్స్ లేదా సన్‌ఫ్లవర్ సీడ్స్ కలిపితే అదనపు పోషకాలు పొందవచ్చు. డైరీ ఉత్పత్తులు తీసుకోనివారు కొబ్బరి లేదా సోయా యోగర్ట్, ఓట్స్ లేదా సోయా పాలను ఉపయోగించి డైరీ-ఫ్రీ స్మూతీ తయారు చేసుకోవచ్చు. ఇది తేలికగా ఉండి రుచికరంగా ఉంటుంది. ఈ ఓట్స్-బనానా స్మూతీ వేగవంతమైన జీవనశైలిలో కూడా ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్‌కు సరైన పరిష్కారం. తక్కువ సమయంలో సులభంగా తయారయ్యే ఈ పానీయం శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ రోజును శక్తివంతంగా ప్రారంభించేందుకు సహాయపడుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

క్రాంతి
శనివారం 04 ఏప్రిల్ 2026
క్రీడలు
epaper.krtvnews.com

# ఐపీఎల్ ఫ్యాన్స్ కు షాక్.. మ్యాచ్ ల సంఖ్య పెంచడంపై కీలక ప్రకటన




స్పోర్ట్స్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ లవర్స్ కు ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ మ్యాచ్ ల సంఖ్య పెంచడం కష్టమేనని తెలుస్తోంది. తాజాగా ఐపీఎల్ మ్యాచ్ లను పెంచాలన్న డిమాండ్లపై ఛైర్మన్ అరుణ్ ధూమల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్ ల సంఖ్య పెంచడం కష్టమేనని షాకింగ్ స్టేట్ మెంట్ ఇచ్చారు. ప్రస్తుతం ఐపీఎల్ లో 74 మ్యాచ్ లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు అరుణ్ ధూమల్. ఛాన్స్ ఉంటే 94 మ్యాచ్ లు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని.. కానీ అది వర్కౌట్ అవ్వడం లేదని వివరించారు.

ఐపీఎల్ మ్యాచ్ లు పెంచలేం

అయితే ఐపీఎల్ మ్యాచ్ ల సంఖ్య పెంచడం అనేది అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ పైన ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత విండోలోనే మ్యాచ్ లు పెంచాలంటే చాలా కష్టమన్నారు. ఒకవేళ పెంచాలనుకుంటే డబుల్ హెడర్స్ మ్యాచ్ లో ఎక్కువగా నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్పష్టం చేశారు. ఇది బ్రాడ్ కాస్టర్లకు పెద్దగా నచ్చ బోదని తెలిపారు. ద్వైపాక్షిక సిరీస్ లకు డిమాండ్ తగ్గుతోన్న నేపథ్యంలో వాటి సంఖ్య తగ్గిస్తే, ఐపీఎల్ మ్యాచ్ లు పెంచుకోవచ్చుని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఐపీఎల్ మ్యాచ్ ల సంఖ్య పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు అరుణ్ ధుమాల్.

# రూ.13 కోట్లు పెట్టి కొంటే హాయిగా పడుకున్నాడు సన్ రైజర్స్ ఆటగాడిపై సెటైర్లు




స్పోర్ట్స్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సన్ రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్ పై దారుణంగా ట్రోలింగ్ నడుస్తోంది. రూ.13 కోట్లు పెట్టి కొనుగోలు చేస్తే, మనోడు హాయిగా నిద్రపోతున్నాడని సెటైర్లు పేల్చుతున్నారు. కేకేఆర్, సన్ రైజర్స్ మధ్య గురువారం మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో హైదరాబాద్ విక్టరీ కొట్టింది. మొన్న బ్యాటింగ్ అదరగొట్టిన హైదరాబాద్, కేకేఆర్ పైన బౌలింగ్ లోనూ దుమ్ము లేపింది. ఈ దెబ్బకు 65 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది సన్ రైజర్స్ హైదరాబాద్. ఈ నేపథ్యంలో లియామ్ లివింగ్‌స్టోన్ ను ట్రోల్ చేస్తున్నారు.

నిద్రపోతున్న రూ. 13 కోట్ల ప్లేయర్

కేకేఆర్, సన్ రైజర్స్ మధ్య నిన్న మ్యాచ్ జరగగా రూ. 13 కోట్ల ప్లేయర్ లియామ్ లివింగ్‌స్టోన్ రిలాక్స్ అవుతూ కనిపించాడు. ఆవలింపులు తీస్తూ.. కెమెరా కంటపడ్డాడు. దీంతో అతనిపై దారుణంగా సెటైర్లు పేల్చుతున్నారు. మొన్నటి మినీ వేలంలో లియామ్ లివింగ్‌స్టోన్ ను రూ. 13 కోట్లకు ఏరి కోరి కావ్య మారన్ కోనింది. అయితే అలాంటి ప్లేయర్ ను ఇప్పటి వరకు జట్టు కోసం వాడుకోలేదని సోషల్ మీడియాలో ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు అవకాశం రాకపోవడంతో లియామ్ లివింగ్‌స్టోన్ కూడా హాయిగా రిలాక్స్ అవుతున్నాడని సెటైర్లు పేల్చుతున్నారు.

కేకేఆర్ మ్యాచ్ సందర్భంగా ఆవలింపులు తీస్తూ నిద్రపోయాడని మరికొంతమంది ఆడుకుంటున్నారు. అతనికి రూ. 13 కోట్లు పెట్టి దండగనే అంటూ మరికొంతమంది ట్రోల్ చేస్తున్నారు. పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యాలు అతన్ని భరించి వదిలేశాయని.. కానీ ఆ ప్లేయర్ పై రూ.13 కోట్లు కావ్య పెట్టడం దారుణం అంటూ మరికొంతమంది చురకలు అంటిస్తున్నారు. ఈ మేరకు లియామ్ లివింగ్‌స్టోన్ ఫోటోలను కూడా వైరల్ చేస్తున్నారు.

# కేరళం ఎన్నికల ప్రచారం.. సంజుపై ప్రధాని మోడీ సంచలన వ్యాఖ్యలు




స్పోర్ట్స్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కేరళం అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్ డౌన్ షురూ అయింది. ఈ నేపథ్యంలో బడా నేతలందరూ ఆ రాష్ట్రంలో పర్యటించి, ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ. ఈ సందర్భంగా భారత వరల్డ్ కప్ హీరో సంజు శాంసన్ పేరును ప్రస్తావిస్తూ ప్రశంసలు వర్షం కురిపించారు మోడీ.

సంజు శాంసన్ లాగా బీజేపీ నేతలు పని చేయాలి

భారత క్రికెటర్ సంజు శాంసన్ లాగా ముందుకు వెళ్లాలని బీజేపీ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ.. సంజు శాంసన్ ఆట తీరును ప్రశంసించారు. వరల్డ్ కప్ నాకౌట్ లో సంజు శాంసన్ చెలరేగి ఆడాడని గుర్తు చేశారు. అతని ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం మరింత బలపడ్డాయని ప్రశంసల జల్లు కురిపించారు. ప్రతి క్రీడాకారుడికి ఈ లక్షణాలు ఉండాల్సిందేనని.. అప్పుడే విజయం మన ముంగిటకు వస్తుందని తెలిపారు.

భారత జట్టుకు అవసరమైనప్పుడల్లా గొప్ప ఆటగాడు రాణిస్తాడని, సంజు కూడా అలాగే వ్యవహరించడానికి వెల్లడించారు. అదే సమయంలో ఓటింగ్ రోజున కూడా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటిని చేరుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మీ అంకితభావం అత్యంత ముఖ్యమన్నారు. విజయం కోసం అదనంగా పనిచేయాలని కోరారు ప్రధాని నరేంద్ర మోడీ. సంజు తరహాలోనే పనిచేసి, పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. కాగా కేరళం అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9వ తేదీన జరుగనున్నాయి. మే 4వ తేదీన ఫలితాలు వెలువడతాయి. ఇది ఇలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రచారం చేసేందుకు కేరళం వెళ్లారు.

# ఆ రాష్ట్ర మహిళా క్రికెటర్లకు గుడ్ న్యూస్




స్పోర్ట్స్ న్యూస్, 03 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్(ఎంపీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. తమ రాష్ట్ర మహిళా క్రికెటర్లకు ప్రతి నెలా ఆర్థిక సహాయం చేయనున్నట్టు ప్రకటించింది. ఇటీవల జరిగిన ఎంపీసీఏ మేనేజింగ్ కమిటీ మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ క్రికెటర్లకు రూ.12,500, దేశవాళీ ప్లేయర్లకు వివిధ కేటగిరీల్లో రూ.6 వేల నుంచి 10 వేల వరకు ప్రతి నెలా అందజేయనుంది. ఈ స్కీం మహిళల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, బీసీసీఐకి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్లకు మాత్రమే వర్తించనుంది. అయితే, బీసీసీఐ నుంచి ఆర్థిక మద్దతు పొందని వారికే ఎంపీసీఏ నుంచి ఈ సహాయం లభించనుంది. ఈ స్కీం ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చింది.

అలాగే, మాజీ పురుషుల క్రికెటర్ల, అంపైర్ల పెన్షన్ పెంపునకు ఎంపీసీఏ ఆమోదం తెలిపింది. బీసీసీఐ పెన్షన్ స్కీంలో లేని మాజీ క్రికెటర్లు ఇకపై రూ. 7 వేలు(4 మ్యాచ్‌లు ఆడిన వారు), రూ.10 వేలు(5-14 మ్యాచ్‌లు), రూ.12,500(15-24 మ్యాచ్‌లు) అందుకోనున్నారు. బీసీసీఐ స్థాయి అంపైర్లు రూ.10 వేలు, రాష్ట్ర స్థాయి అంపైర్లు రూ.6,500 పొందనున్నారు. 75 ఏళ్ల పైబడిన వారికి అదనంగా మరో రూ.7,500 అందుతాయి. అలాగే, అంపైర్లు, స్కోరర్లు, సెలెక్టర్ల గౌరవ వేతనాలను కూడా ఎంపీసీఏ పెంచింది.



KR TV క్రాంతి
శనివారం 04 ఏప్రిల్ 2026
# సినిమా న్యూస్
epaper.krtvnews.com



## అందమైన ప్రేమకథలో అదిరిపోయే మలుపులు




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆది సాయికుమార్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో సాలిడ్ హిట్ అందుకున్న ఆయన, అదే జోష్‌తో తన తదుపరి చిత్రాన్ని పట్టాలెక్కించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 10గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా, ఈ ఈ సినిమా టైటిల్‌తో పాటు మేకర్స్ విడుదల చేసిన క్యాప్షన్ అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. "వారు వేర్వేరు ప్రపంచాలకు చెందినవారు.. కానీ విధి వారిని ఒకరికొకరు సొంతమయ్యేలా చేసింది" అంటూ విధి, ప్రేమ, నమ్మకం కలయికతో సాగే ఒక సరదా ప్రయాణంగా ఈ కథ ఉండబోతోందని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది.

అంతేకాకుండా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇక విడుదలైన పోస్టర్‌లో చార్మినార్‌ను చూపించడంతో పాటుగా ఓ హార్ట్ సింబల్‌ను జోడించి అందరినీ మెస్మరైజ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ ఎన్నో మలుపులతో పాటు ప్రేమకథగా చిత్రంగా రాబోతుందని స్పష్టం అవుతోంది. ఇక ఫని క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈసినిమాకు రాజేష్ దండా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారా బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కాబోతోంది. ఆది సాయికుమార్ సరసన ఆమె జోడీ క్యూట్‌గా ఉండబోతోందని ఇన్సైడ్ టాక్. వరుస విజయాలతో ఫామ్‌లో ఉన్న ఆది, ఈసారి ఒక ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమయ్యారు. రాజేష్ దండా నిర్మాణ విలువలు, ఫని క్రిష్ణ మేకింగ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.




## యుగాల నాటి రహస్యాలు ఊహకందని శక్తి

టాలీవుడ్ సెన్సేషనల్ హిట్ 'విరూపాక్ష' తర్వాత కాస్త విరామం తీసుకున్న మెగా హీరో సాయి దుర్గ తేజ్, ఇప్పుడు వరుస పెట్టి క్రేజీ ప్రాజెక్టులను లైన్లో పెడుతున్నారు. ఇప్పటికే 'సంబరాల ఏటిగట్టు' షూటింగ్‌లో బిజీగా ఉన్న ఆయన, తాజాగా తన 19వ సినిమాకు సంబంధించి అఫీషియల్ అప్‌డేట్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ భారీ చిత్రాన్ని 'క' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్లుగా మారిన సుజిత్-సందీప్ తెరకెక్కిస్తుండటం విశేషం. ఈ సినిమా 'హణు-19' వర్కింగ్ టైటిల్‌తో రాబోతుంది. ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ చూస్తుంటే, సాయి దుర్గ తేజ్ ఏదో పెద్ద ప్రయోగాన్నే చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక యోధుడి గెటప్‌లో, చేతిలో భారీ కత్తి పట్టుకుని కొండపై నిలబడి అడవి వైపు సీరియస్‌గా చూస్తున్న తేజ్ లుక్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. "యుగాల రహస్యాలు.. ఊహకు అందని శక్తి.. ఒక కొత్త పౌరాణిక శక్తి ఉదయిస్తోంది" అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్, సినిమాపై అంచనాలను ఆకాశానికి ఎత్తేసింది. షైన్ స్క్రీన్స్, అర్చన ప్రజెంట్స్, విజయదుర్గ ప్రొడక్షన్స్ బ్యానర్లపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'క' సినిమాతో సరికొత్త మిస్టరీని వెండితెరపై ఆవిష్కరించిన సుజిత్-సందీప్, ఇప్పుడు సాయి దుర్గ తేజ్‌ను ఎలా చూపిస్తారో అన్న క్యూరియాసిటీ అభిమానుల్లో పెరిగిపోయింది. విరూపాక్ష లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత మళ్లీ ఒక డిఫరెంట్ జోనర్‌లో తేజ్ రాబోతుండటంతో బాక్సాఫీస్ వద్ద మరోసారి పూనకాలు ఖాయమనిపిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## అర్ధరాత్రి ఆమెను తట్టుకోలేము

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్‌ను అత్యంత జోరుగా ప్రారంభిస్తోంది. గత ఏడాది ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరును రెండో పెళ్లి చేసుకున్న సామ్, ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే పెట్టింది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్న సమంత, తన సహనటి, స్నేహితురాలు కీర్తి సురేష్ గురించి చేసిన కొన్ని షాకింగ్ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కీర్తి సురేష్‌లోని అసలు కోణాన్ని బయటపెడుతూ సమంత ఆసక్తికర విషయాలు పంచుకుంది. "కీర్తి సురేష్ అర్ధరాత్రి 2 గంటల సమయంలో కూడా ఎంతో ఉత్సాహంగా, ఫన్నీగా మాట్లాడుతుంది. ఆ టైమ్‌లో ఆమె ఎనర్జీ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆమె నవ్వులు, అల్లరి తట్టుకోలేక భయంతో అక్కడి నుండి పరిగెత్తాలి అనిపిస్తుంది. అయితే, అలా అని ఆమె మద్యం సేవించి అలా చేస్తుందని అనుకోకండి..

అసలు డ్రింక్ చేయకుండానే కీర్తి ఆ సమయంలో హైపర్ మ్యాక్స్ మోడ్‌లో ఉంటుంది" అని సమంత చెప్పుకొచ్చింది. అంతేకాకుండా, కీర్తికి అద్భుతమైన సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉందని సమంత ప్రశంసించింది. "ఆమె కేవలం 0.03 సెకన్లలోనే ఎదుటివారిని తన మాటలతో డిస్ట్రాయ్ చేయగలదు. కీర్తి చాలా బెస్ట్ పర్సన్" అంటూ కీర్తి సురేష్‌లోని కామెడీ యాంగిల్‌ను సామ్ పరిచయం చేసింది. ఎప్పుడూ పద్ధతిగా, హోమ్లీగా కనిపించే కీర్తి సురేష్ గురించి సమంత ఇలాంటి క్రేజీ విషయాలు చెప్పడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం సమంత చేసిన ఈ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కాగా.. వీరిద్దరూ కలిసి బ్లాక్ బస్టర్ హిట్ 'మహానటి' చిత్రంలో కలిసి నటించారు. దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ హీరోలుగా నటించిన ఈ సినిమా ప్రేక్షకులను మంత్రముగ్దులను చేయడంతో పాటుగా.. బాక్సాఫీసు వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది.






## రామ్ చరణ్ 'పెద్ది'
### ఏప్రిల్ 30న రిలీజ్ ఫిక్స్
### బుకింగ్స్ ఓపెన్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఓ వైపు స్వయంగా రామ్ చరణే ఈ సినిమా వాయిదా పడడం లేదని క్లారిటీ ఇచ్చిన కూడా.. విడుదల తేదీకి నెల రోజులు కూడా సమయం లేకపోవడంతో.. సోషల్ మీడియాలో పోస్ట్‌పోన్ వార్తలు గట్టిగా వినిపించాయి. దీనికి కారణం కూడా లేకపోలేదు. తాజాగా హనుమాన్ జయంతి సందర్భంగా విడుదలైన కొత్త పోస్టర్‌లో రిలీజ్ డేట్ వేయలేదు మేకర్స్. ఇది పెద్ది రిలీజ్ పై పై డౌట్ వచ్చేలా చేసింది.

కానీ ఆ వార్తలేవి నిజం కాదని విశ్వసనీయంగా తెలిసింది. కేవలం ఒక ఐటెం సాంగ్ మినహా టాకీ పార్ట్ అంతా రీ-రికార్డింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. మరో వారంలో అవన్నీ ఫినిష్ అవుతాయని రామ్ చరణ్ చెప్పిన దాని ప్రకారం ఏప్రిల్ 30న పెద్ది బాక్సాఫీస్ బరిలో దిగడం పక్కా ఈ విషయంలో నోడౌట్ అని యూనిట్ వర్గాల మాట. ఈ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఈ సినిమా డిస్ట్రిబ్యూటర్స్ కూడా సమాచారం అందిచారట. అలాగే ఏప్రిల్ 8న పెద్ది ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు ఏప్రిల్ 30కే సినిమా వస్తుందని ప్రమోషన్లు నిర్వహిస్తున్నారు. మరోవైపు.. చిత్ర యూనిట్ ప్యాచ్ వర్క్‌తో పాటు.. ఐటెం సాంగ్ షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసేందుకు గట్టిగా శ్రమిస్తోంది. పెద్ది రిలీజ్ కన్ఫర్మ్ కావడంతో నిఖిల్ నటిస్తున్న స్వయంభు, అఖిల్ నటిస్తున్న లెనిన్ సినిమాల రిలీజ్ పై క్లారిటి వచ్చే అవకాశం ఉంది.




Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com